# టాగోర్ కథలు

తెలుగు సేత: చంద్రలత



# రాత పుస్తకం రవీంద్రనాథ టాగోర్

తెలుగు సేతః చంద్రలత

బెంగాలీ మూలం: **ఖాతా** - 1898

రాయడం నేర్చుకొన్నప్పటి నుంచీ ఉమ పూటకొక కొత్త సమస్య తెచ్చిపెడుతోంది. ప్రతి గదిలోని గోడల మీదా మసిబొగ్గుతో వంకరటింకరగా రాస్తోంది——“**నీరు జలజల... ఆకులు గలగల**” అంటూ.

ఉమకు వాళ్ల వదిన తలగడ కింద ***హరిదాసు రహస్యకథ*** *(1)* అన్న పుస్తకం దొరికింది. ఇక అంతే. ఆ పుస్తకం ప్రతి పుటలోనూ బరబరా గిలికేసింది——“**నల్లనీరు ఎర్రపూవు**” అని.

ప్రతిపూటా అలవాటుగా తిరగేసే పంచాంగంలోని రాశుల చక్రాలన్నిటినీ పెద్దపెద్ద గజిబిజి అక్షరాలతో కప్పేసింది. వాళ్ల నాన్న రోజువారీ చిట్టాపద్దుల పుస్తకంలోని ఆదాయ వ్యయాల వరసలో ఏమి రాసిందో చూడండి——
“**ఎవరు కష్టపడి చదివితే, వారు పెద్దయ్యాక గుర్రపు బగ్గీలలో తిరుగుతారు**” అని.

ఈ రకపు రచనా కుతూహలాన్ని వ్యక్తపరుచుకోవడానికి ఉమకు ఎలాంటి ఎదురులేదు.

చివరికి ఒక రోజు ఓ పెద్ద పొరపాటు జరిగిపోయింది.

ఉమ పెద్దన్న గోవిందలాల్, చూడడానికి అమాయకంగా కనబడతాడు కానీ వార్తాపత్రికల్లో వ్రాస్తూ ఉంటాడు. అతని మాటలు విని ఇరుగుపొరుగు, చుట్టాలు పక్కాలు ఎలాంటి సందేహం లేకుండా, 'అతనొక ఆలోచనాపరుడు' అని అనుకుంటుంటారు.

యూరోపియన్ శాస్త్రవేత్తలకు శరీరశాస్త్రంలో కొన్ని పొరపాటు అభిప్రాయాలు ఉన్నాయి. వాటిని గోవిందలాల్ తీవ్రంగా ఖండించాడు. ఆ ఖండన ఎటువంటి హేతుబద్ధమైన వాదనతోనో కాదు; డాంబికమైన పదాలు దట్టించిన ఓ ఆడంబర వ్యాసంతో.

ఒక ఏకాంత మధ్యాహ్నవేళ ఉమ పెద్దన్న కలమూ సిరా తీసుకొని, ఆ వ్యాసం మీద పెద్దపెద్ద అక్షరాలతో ధైర్యంగా వ్రాసేసింది——

"**గోపాల్ మంచి బాలుడు. ఏది పెట్టినా చక్కగా తింటాడు**" అని.

గోపాల్ అనే కలంపేరుతో గోవిందలాల్ వ్యాసాన్ని చదివే పాఠకులను ఉమ నేరుగా సంబోధించినట్లు నాకు అనిపించడం లేదు. కానీ ఉమ పెద్దన్న కోపానికి అవధులు లేవు. మొదట అతను ఉమను కొట్టాడు. ఆ తరువాత, ఆమె దగ్గర మిగిలి ఉన్న పెన్సిల్ ముక్కను, సిరా అద్దిన పాళీ విరిగిన కలంతో సహా, ఆమె ఎంతో అపురూపంగా చూసుకునే ఆ రాత పరికరాలన్నిటినీ లాక్కున్నాడు.

దెబ్బలు తిన్న ఆ అమ్మాయికి తనపై అంత తీవ్ర దండన ఎందుకో పూర్తిగా అర్థం కాకపోయినా, వేదన నిండిన గుండెతో గదిలో ఓ మూలన నక్కి ఆపకుండా ఏడుస్తూనే ఉంది.

క్రమశిక్షణాపర్వం ముగిసాక కాస్తంత మెత్తబడ్డ మనసుతో గోవిందలాల్ ఉమ వస్తువులు తిరిగి ఇచ్చేశాడు. ఆమె బాధకు ఓదార్పుగా, చక్కగా బైండ్ చేసిన ఒక గీతల రాతపుస్తకాన్ని (నోట్‌బుక్) ఉమకు ఇచ్చాడు.

ఉమకి అప్పుడు ఏడేళ్లు. అప్పటినుంచి ఆ రాతపుస్తకం రాత్రిళ్లు ఉమ తలగడ కింద, పగలు ఆమె వళ్ళో ఉంటోంది. చిన్న జడ వేసుకొని, పనిమనిషిని తోడుగా తీసుకొని, బాలికల బడికి వెళ్ళేటప్పుడు ఉమ ఆ రాతపుస్తకాన్ని తన వెంట తీసుకొని వెళ్ళేది.

దానిని గమనించిన కొందరు బాలికలు ఆశ్చర్యపోయారు. మరికొందరు ఈర్ష్య పడ్డారు. ఇంకొందరు అసూయ పడ్డారు.

తన రాతపుస్తకంలో మొదటి ఏడాది ఉమ ఎంతో కుదురుగా రాసింది——
"**పిట్టలు కువకువలాడుతున్నాయి. రాత్రి ముగిసింది.**"

ఉమ తన పడకగదిలో కూర్చుని ఆ రాతపుస్తకాన్ని బిగించి పట్టుకొని, బిగ్గరగా రాగాలు తీస్తూ చదువుతూ రాసుకొనేది. అలాగే ఎన్నో చిట్టి కవితలు, చిన్ని వచనాలు ఆ రాతపుస్తకంలో చేరిపోయాయి.

రెండో ఏడాది వాటికి తోడు ఒకటో రెండో ఉమ స్వంత రచనలు వచ్చి చేరాయి. అవి చాలా చిన్నవి, కానీ చాలా గంభీరమైనవి. పరిచయం లేదు. తీర్మానపు ముగింపు లేదు.

***'కథామాల' (2)*** నుంచి చూసి రాతపుస్తకంలో రాసిన ***'పులి–పిట్ట'*** కథలో చివరన అంతకు ముందెన్నడు ★'కథామాల'★లో కనబడని వాక్యం ఒకటి వచ్చి చేరింది. ఆ వాక్యం ఇలా సాగింది——
"**నాకు యశి అంటే చాలా ప్రేమ.**"

అయ్యా పాఠకులారా, నేనేదో ప్రేమకథ చెప్పబోతున్నాననుకునేరు! యశి పదకొండో పన్నెండేళ్ల ఇరుగుపొరుగు అబ్బాయి కాదు. యశి ఆ ఇంటి ముసలి పనిమనిషి. ఆమె అసలు పేరు యశోద.

ఏది ఏమైనా, ఆ వాక్యం యశి పట్ల ఉమకు ఉన్న యదార్థ భావనలను వ్యక్తపరచలేదు. రెండు పేజీలు దాటే సరికి ఆ మాటలకు విరుద్ధ భావనలు కనబడవచ్చు.

ఇలా ఒకటో రెండో సందర్భాలలో మాత్రమే కాదు, ప్రతి అడుగులోనూ ఉమ రాతల్లో తనని తానే విబేధించుకోవడం కనబడుతుంది.

ఒకచోట అదే జరిగింది——"**హరితో స్నేహం ఎప్పటికీ రద్దయింది**" అని రాసింది ఉమ.
(హరిచరణ్ కాదు, హరిదాసి అనే ఆమె తోటి విద్యార్థిని.)

కొన్ని పేజీలు దాటిన తరువాత——"**ఈ సమస్త ప్రపంచంలో హరిని మించిన ప్రాణస్నేహితురాలు ఉమకి మరొకరు లేరు**" అని తెలుస్తుంది.

ఆ తరువాత ఏడాది, ఉమకి తొమ్మిదేళ్లపుడు (3), ఒకరోజు ఉదయమే వాళ్లింటి ముందు మంగళవాయిద్యాలు మోగసాగాయి. ఉమ పెళ్ళి.

పెళ్ళికొడుకు పేరు ప్యారీమోహన్. అతను ఉమ పెద్దన్న గోవిందలాల్ కు తోటి రచయిత. ప్యారీలాల్ వయస్సు ఎక్కువేమీ కాదు, అలాగే చదువు కూడా. ఆధునిక విశాలభావాలు ఇంకా అతని తలకెక్కలేదు. అందుకే, అతని పురాభావనల వలన ఇరుగుపొరుగు మనస్పూర్తిగా అతనికి గొప్ప విలువను ఇచ్చేవారు.

గోవిందలాల్ అతనిని అనుకరించడానికి ప్రయత్నించేవాడు. కానీ ఆ ప్రయత్నంలో పూర్తిగా విజయవంతం కాలేకపోయాడు.

చక్కటి బెనారస్ పట్టుచీర ధరించి, తన చిన్నిముఖాన్ని మేలిముసుగులో దాచుకొని ఏడుస్తూ అత్తగారింటికి వెళ్ళింది ఉమ.

ఉమ తల్లి అంది—"నా చిట్టితల్లీ, అత్తగారి మాటలను గౌరవించు. ఇంటి పనులన్నీ బాధ్యతగా చేయి. చదువుకోవాలని సమయం వృథా చేయకు."

పెద్దన్న గోవిందలాల్ ఉమకు చెప్పాడు—"చూడు, అట్లాంటి గొప్పింటి గోడలనిండా నీ గొగ్గిరి గీతలు గీయకు. ఎప్పుడైనా సరే, ప్యారీ మోహన్ రాసిన ఏ రచన మీదైనా నీ పిచ్చిగీతలు గీయకు."

ఆ అమ్మాయి గుండెలో దడ మొదలయింది. తను వెళ్ళే చోట ఎవరూ తనని క్షమించబోరని ఆమె గ్రహించింది.

ఎంతకాలంగానో, ఎన్నో తిట్లు తినో నేర్చుకొన్న విషయం—వాళ్ళంతా "తప్పు, నేరం, లోపం" అని పిలిచే విషయం. అది పట్టరాని ఉమ రచనాఉత్సాహం.

ఆ ఉదయం కూడా పెళ్ళి బాజాలు మోగుతూనే ఉన్నాయి. కానీ బనారస్ పట్టుచీర కట్టించి, నగలన్నీ అలంకరించి, మేలిముసుగు కప్పేసిన ఆ చిన్ని బాలిక గుండెలోని దడదడలను ఆ పెళ్ళిబృందంలోని వారెవరూ అర్థం చేసుకోలేదు.

ఉమతోబాటు యశి కూడా వెళ్ళింది. కొన్నాళ్ళు ఉండి ఉమ అత్తగారింట కుదుటపడగానే తిరిగి రావాలన్న నిశ్చయంతో వెళ్ళింది.

ఆప్యాయత కురిపించే యశి ఎంతో తర్జనభర్జన తరువాత ఉమ రాతపుస్తకాన్ని తమతోబాటు తీసుకువచ్చింది.

పసితనపు స్వేచ్ఛలోనుంచి అర్థాంతరంగా ఇల్లాలి బాధ్యతల్లోకి అడుగుపెట్టినా, ఆ రాతపుస్తకం ఉమ పుట్టింటిలో భాగం. తన జన్మస్థానంలో గడిపిన ఆ కొద్దికాలానికి అదొక గుర్తు. అమ్మానాన్నల ప్రేమతో అల్లుకున్న పొదరింటి చరిత్ర. ఎదిగి ఎదగని ఆమె వంకరటింకర అక్షరాలు——ఇంకా బాల్యం వీడని అమాయకత్వపు తియ్యని జ్ఞాపకం.

అత్తవారింటికి వెళ్ళిన కొంతకాలం ఉమ ఏమీ వ్రాయలేదు. వాస్తవానికి తీరిక దొరకలేదు. చివరికి ఒకరోజు యశి తన పూర్వస్థానానికి తిరిగి వెళ్ళింది.

ఆ రోజు మధ్యాహ్నం ఉమ పడకగది తలుపులన్నీ మూసేసి, తగరపు రేకుడబ్బాలోని రాతపుస్తకాన్ని బయటకు తీసి ఏడుస్తూ రాసింది——
"**యశి ఇంటికి వెళ్ళిపోయింది. నేనూ అమ్మ దగ్గరికి వెళ్ళాలి.**"

ఆ రోజుల్లో ***చారు పథ్ (4)*** నుంచో, ***బోధోదయ (5)*** నుంచో చూసి రాయడానికి ఉమకి సమయం లేదు. అందుకే ఆ రోజుల్లో ఆ అమ్మాయి చిన్ని చిన్ని స్వంత రచనల మధ్య వ్యవధి ఎక్కువ లేదు. వాటి చివరలో ఒక వాక్యం రాసినట్టుగా కనబడింది——
"**మా పెద్దన్నయ్య వచ్చి నన్ను ఇంటికి తీసుకువెళితే, అతని రచనలను అసలు పాడుచేయను.**"

ఉమ తండ్రి ఉమను ఇంటికి తీసుకువద్దామని ప్రయత్నించేవాడు. ప్యారీ మోహన్ తో జట్టుకట్టిన గోవిందలాల్ ఆ ప్రయత్నాలన్నిటికీ అడ్డుపడేవాడు.

'ఉమ ఇప్పుడిప్పుడే భర్త పట్ల విధేయత నేర్చుకొంటోంది. పుట్టింటి ప్రేమతో, చీటికి మాటికి అతని దగ్గర నుంచి తీసుకొస్తే, అనవసరంగా అయోమయంలో పడుతుంది. గాడి తప్పుతుంది.' అని అనేవాడు.

గోవిందలాల్ ఈ విషయాలనే క్రోఢీకరించి, గట్టిగా నొక్కిచెబుతూ, సలహాలతో నింపి, వెటకారాన్ని గుప్పించి, ఒక అద్భుతమైన వ్యాసం రాసాడు. అతనిలాంటి అభిప్రాయాలే ఉన్న అతని పాఠకులు, ఆ వ్యాసంలోని స్థిరభావనల స్పష్టతకు ముగ్ధులై, పులకించిపోయారు.

ఇదంతా వేరొకరి ద్వారా విన్న ఉమ, తన రాతపుస్తకంలో రాసింది.

"**అన్నయ్యా, నిన్ను వేడుకుంటున్నాను. నన్ను ఒకసారి ఇంటికి తీసుకెళ్ళు. నేను నిన్నెపుడు విసిగించను.**"

ఒకరోజు మూసిన తలుపుల వెనకాల, ఉమ అలాంటి అర్థంపర్థం లేని మాటలేవో తన రాతపుస్తకంలో రాసుకుంటోంది.

ఉమ ఆడపడుచు, తిలకమంజరి, కుతూహలంతో, 'ఎప్పుడూ ఉమ తలుపులు ఎందుకు మూసుకొంటుందో... ఆ మూసిన తలుపుల వెనక ఏమి చేస్తుందో' అని తెలుసుకోవాలని అనుకొంది. తలుపుకన్నంలో నుంచి ఉమ వ్రాయడాన్ని చూసింది. వాళ్ళ అంతఃపురంలోకి, చదువుల దేవత, సరస్వతి, ఎన్నడూ రహస్యంగానైనా అడుగు పెట్టలేదు.

ఆమె పెద్దచెల్లెలు కనకమంజరి వచ్చింది. ఆమె కూడా తలుపుకన్నంలో నుంచి తొంగి చూసింది. వారిద్దరి చిన్నచెల్లెలు అనంగమంజరి కూడా మూసిన తలుపుల వెనుక దాగిన రహస్యంలోకి తొంగి చూసింది; కాలి మునివేళ్ళ మీద నిలబడి, అతి ప్రయాసతో.

రాతలో మునిగిన ఉమకి, తెలిసిన గొంతుల ముసిముసి నవ్వులు వినబడ్డాయి. ఉమకు విషయం అర్థమై పోయింది. గబగబ తన రాతపుస్తకాన్ని పెట్టెలో దాచిపెట్టేసింది. అవమానంతో, భయంతో కంపించిపోతున్న తన ముఖాన్ని పడకమీద దిండులో దాచేసింది.

ఈ వార్త చేరగానే, ప్యారీమోహన్ తల్లడిల్లిపోయాడు. విద్యాబోధన, చదువులు మొదలయితే, ఆపై నాటకాలు, నవలలు దిగుమతి అయితే, కుటుంబ పవిత్రత దెబ్బతినక తప్పదు.

అందులోనూ, ప్యారీమోహన్ ఈ విషయంపై కొన్ని ప్రత్యేకమైన ఆలోచనలతో ఒక సిద్ధాంతం కనుగొన్నాడు. 'దాంపత్యబంధం, వధూవరులనే బలమైన రెండు శక్తుల కలయిక వలన ఏర్పడుతుంది. కానీ, చదువుసంధ్యలతో వధువులోని స్త్రీతత్వం తగ్గిపోయి, పురుషశక్తి నిండిపోతే, ఆపై ఆ రెండు పురుషశక్తుల మధ్య ఘర్షణ తప్పదనీ, అలా పుట్టిన వినాశకార శక్తిలో దాంపత్యం కరిగిపోయి, మాయమవుతుందని, దానితో స్త్రీ విధవరాలు అవుతుందని,' అతను చెప్పేవాడు.

ఈనాటి వరకు అతని సిద్ధాంతాన్ని ఎవరూ వ్యతిరేకించలేదు.

ఆ సాయంకాలం వారి గదిలోకి రాగానే, ప్యారీమోహన్ ఉమను శాయశక్తులా తిట్టిపోశాడు. హేళన చేశాడు. అతను అన్నాడు, 'యూనిఫార్మ్‌లు కుట్టించమంటాను!' 'ఇక, ఇల్లాలు చెవిలో కలం చెక్కుకొని, ఆఫీసుకి బయలెల్లాలి!'

ఉమకు ఇవేమీ సరిగ్గా అర్థం కాలేదు. ఆమె ప్యారీమోహన్ వ్యాసం చదవ లేదు. ఆమె హాస్యచతురత అప్పటికింకా ఎదగలేదు. ఏది ఏమైనా, ఆమె లోలోనికి కుంచించుకు పోయింది. భూమి రెండుగా విచ్చిపోయి, తనను ఈ అవమానం నుంచి రక్షించాలని అనుకొంది.

చాలాకాలం వరకు ఉమ ఏమీ వ్రాయలేదు.

కాని, ఒక శరత్ కాలపు ఉదయం, ఒక బిచ్చగత్తె "ఆగమని" పాట పాడుకొంటోంది. కిటికీచువ్వలకు ముఖం ఆనించి, ఉమ ఆ పాటను వింటోంది. ఒకవైపు శరత్ కాలపు సూరీడి వెచ్చదనంలో, తన చిన్నతనపు రోజులు గుర్తుకు వచ్చాయి. పై నుంచి, ఆ ఆగమన గీతాన్ని వింటూ, మౌనంగా ఉండ లేకపోయింది.

ఉమ పాడలేదు. కానీ, రాయడం నేర్చుకోగానే, ఆమె ఒక అలవాటు చేసుకొంది. పాడలేని లోపాన్ని, ఆ పాటను వ్రాసుకోవడంలో పూరించేది.

ఆ నిరుపేదరాలు ఇలా పాడుతోంది.

"ఊరివాళ్ళంటున్నారు, 'ఓ ఉమను కన్నతల్లీ...
అదుగో, నువ్వు పోగొట్టుకున్న తార తిరిగివస్తోంది!'
అది విన్న మహారాణి మతితప్పినట్లు పరిగెత్తింది.
'ఉమ ఏదీ? చెప్పండి... ఎక్కడ?'
ఏడుస్తున్న రాణి అంటోంది,
'నా ఉమ వస్తోంది.
రా... నా బిడ్డా... ఒకసారి రా!
రావే ఒకసారి...నా చిన్నారి,
నిన్ను నా ఒడిలోకి తీసుకోనీ!'
తన చేతులుచాచి అమ్మను వాటేసుకొన్న
ఆ అల్లాడేబిడ్డ వెక్కుతూ రాణితో అంటోంది.
'ఎందుకు? నన్ను నీ కన్నకూతురిలా పెంచావా?'"

ఉమ గుండె ముక్కలయింది. భావోద్వేగంతో నిండిపోయింది. ఆమె కళ్ళు కన్నీళ్ళతో నిండాయి.

ఉమ రహస్యంగా ఆ గాయనిని పిలిచింది. మూసిన తలుపుల వెనక, చిత్రమైన పదాలతో ఆ పాటని తన రాతపుస్తకంలో రాసుకోసాగింది.

తిలకమంజరి, కనకమంజరి, అనంగమంజరి తలుపు కన్నంలోనుంచి, అంతా చూశారు. మౌనంగా ఉండీ ఉండీ, ఆకస్మాత్తుగా చప్పట్లు కొట్టారు. "వదినా, నువ్వేం చేస్తున్నావో, మేమంతా చూసేసాం!"

ఉమ గబగబ తలుపులు తీసి, పెగిలీ–పెగలని నీరసపు పీలగొంతుతో వారిని బతిమిలాడింది.

"మా మంచి ఆడపడుచులు కదా, దయచేసి ఎవరికీ చెప్పకండి. నేను మిమ్మల్ని ప్రాధేయపడుతున్నాను. నేను ఇక ఎప్పుడు ఇలా చేయను. ఇంకెప్పుడూ నేను వ్రాయను."

ఉన్నట్టుండి ఉమకి తట్టింది. తిలకమంజరి తన రాతపుస్తకాన్ని కన్నార్పకుండా చూస్తోందని.

అంతే, ఉమ తన రాతపుస్తకాన్ని గుండెలకు హత్తుకొని, పరిగెత్తింది. ఆ ఆడపడుచులు ఉమ రాతపుస్తకాన్ని బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నించారు. వారికి వీలుకాక పోయే సరికి, అనంగమంజరి వాళ్ళ అన్నను కేకేసింది.

ప్యారీమోహన్ వచ్చాడు. చిరాగ్గా మంచంపై కూర్చున్నాడు. మేఘాలు ఒరుసుకొనే గొంతుతో అన్నాడు, "రాతపుస్తకాన్ని ఇవ్వు!" తన ఆజ్ఞలో గాంభీర్యం మోతాదు తగ్గించి, స్వరాన్ని కొంచెం తగ్గించి, ఘాటుగా ఖరాఖండిగా అన్నాడు, "దాన్నిటు ఇవ్వు!"

తన రాతపుస్తకాన్ని గుండెలకు అదిమి పట్టుకొన్న ఆ దీనబాలిక, భర్త వంక దయనీయంగా చూసింది. తన దగ్గర్నుంచి బలవంతంగా లాక్కోవడానికి, ప్యారీమోహన్ తన వైపు రావడం గమనించింది. తన రాతపుస్తకాన్ని నేల మీదకు విసిరేసి, రెండు చేతులతో ముఖాన్ని కప్పుకుంటూ... ఒకసారిగా నేలపై కుప్పకూలిపోయింది.

ఆ రాతపుస్తకాన్ని చేత బుచ్చుకున్న ప్యారీమోహన్, ఆ బాలిక రచనలను బిగ్గరగా చదవసాగాడు. అవి వింటూ, ఉమ నేలను మళ్ళీ మళ్ళీ కౌగలించుకొంది; నేల లోలోనికి కూరుకుపోయేట్టుగా.

మిగిలిన ముగ్గురు బాలికాశ్రోతలు ముసిముసి నవ్వులతో, నిలువెల్లా ఊగిపోసాగారు. ఆ తరువాత ఎన్నడూ ఉమ రాతపుస్తకాన్ని చేతబట్టలేదు.

ప్యారీమోహన్ దగ్గర కూడా, రాకాసిముళ్ళకంపల్లాంటి సిద్ధాంతాలతో నిండిన రాతపుస్తకం ఒకటి ఉంది. కానీ, ఆ రాతపుస్తకాన్ని నాశనం చేసి, మానవాళిని కాపాడే మహానుభావులెవరున్నారు?

★

అనుసృజకుల వ్యాఖ్యానం

ఖాతా (1898) అప్పటికి సర్వత్రా సహజమైన బాల్యవివాహాల నేపథ్యంలో, ఒక జిజ్ఞాసువు, బాలికా వధువు ఉమ కథ ఇది. ఉమ అప్పుడప్పుడే మొగ్గ తొడుగుతున్న చిన్నారి రచయిత. రాయడంలోని ఆనందాన్ని, తన రాతలో ఓదార్పును, ఉపశమనాన్ని, స్నేహాన్ని, సాన్నిహిత్యాన్ని పొందుతుంది.

పిల్లలకు ఆడుకోవడం ఎంత సహజమో, నేర్చుకోవడం కూడా అంతే. అయితే, ఆనాటి ఆధునిక విద్య బాలురకే పరిమితం. బాలికలలో అక్షరాస్యత మృగ్యం. అందులోనూ, వివాహితులైన బాలికలకు చదువు అసాధ్యం. బాలికావిద్యను ఒక సహజ మానవగుణంగా చిత్రిస్తూ, ఆనాటి నవనగరీకుల "రాతపుస్తకాల్లోని రాకాసి ముళ్ళకంపను" నాశనం చేయాలంటూ, వారి సంకుచిత భావాల్లోని బోలుతనాన్ని ఘాటుగా ఖండిస్తూ, ఔత్సాహిక జిజ్ఞాసువులలో మొగ్గలోనే తుంచేయబడుతోన్న రచనాకుతూహలాన్ని, ఉమ కథలో హృద్యంగా చెబుతారు టాగోర్.

ఈ కథ పెద్దల కోసం, పెద్ద పిల్లల కోసం.

★

పాద సూచిక Foot Note

★ఖాతా, బెంగాలీ ప్రచురణ 1898, సాధన పత్రిక.

1.హరిదాస్ రహస్యకథ (1896, చారుచంద్ర ముఖోపాధ్యాయ, బోటనీ నేపథ్య మిస్టరీ నవల, అప్పుడు ప్రాచుర్యంలో ఉన్న డిటెక్టివ్ సాహిత్యం).

2.కథామాల (1885, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, బెంగాలీ పిల్లల కథలు).

3.1929లో వచ్చిన శారదాబిల్లుతో బాల్యవివాహాలు నిషేధించబడ్డాయి. వధూవరుల కనీసవయస్సులో ఆ తరువాత అనేక మార్పులు జరిగాయి.

4."ఆగమని"... పుట్టింటికి తిరిగి వస్తున్న ఉమ, దుర్గాదేవి,ని ఆహ్వానించే పుట్టింటి వారి పాటలు. సాధారణంగా బెంగాలీ బౌవుల్ గాయకులు శరత్ ఋతువు ఆరంభంలో పాడతారు. దుర్గాపూజ ఈ కాలంలోనే జరుగుతుంది.

5.చారు రథ్ (I–1853, II–1854, ఉక్కోయ్ కుమారదత్తు, బెంగాలీ బాలల సైన్స్ పుస్తకాలు).

6.బోధోదయ (1857, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, బెంగాలీ వాచకం).

References and Study:

1. The Note Book, Rabindranath Tagore, Translator: Arunabha Ghosh, https://www.the-criterion.com/V5/n1/Ghosh.pdf
2. The Note Book, Rabindranath Tagore, Translator: Lopamudra Banerjee, https://www.setumag.com/2016/11/the-notebook-rabindranath-tagore.html
3. Exercise-book, William Radice, https://cdn-cms.fstatic.com/uploads/1259807/normal_5d5c4f8075d93.pdf
4. Hindi: कॉपी - रवीन्द्रनाथ टैगौर की लिखी कहानी

★★★

COMMENTS